క్లుప్తంగా

అంధకారంలో గ్రామాలు

నార్నూర్: గాదిగూడ మండలంలోని కుండి గ్రామ పంచాయతీ పరిధిలోని శేకుగూడ, మారోతిగూడ, కొలాంగూడ గ్రామాలకు గత రెండు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో అంధకారం నెలకొంది. విద్యుత్ సరఫరా చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరుతున్నారు.

పింఛన్ అమలు చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ప్రకటించిన అన్ని పథకాలతో పాటు ఆసరా పింఛన్ వెంటనే అమలు చేయాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షురాలు సూర్యవంశీ సుజాత డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి చేయూత పెన్షన్ దారుల మహాసభ ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి పది నెలలు దాటినా.. పెన్షన్ దారులకు పెంచిన పెన్షన్లను ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్, ప్రమోద్ కుమార్, నాందేవ్, కిషన్, కృష్ణ, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన నరేందర్ రాథోడ్‌ను తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు శ్రీధర్ మెట్‌పెల్లివార్, డీఐవో శ్రీనివాస్, డీటీసీవో సుమలత, సంఘం ప్రధాన కార్యదర్శి సర్ఫరాజ్, శ్రీకాంత్, సందీప్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

హాల్ నిర్మాణానికి భూమిపూజ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో హనుమాన్ ఆలయ కమిటీ హాల్ నిర్మాణానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో దేవన్న, సతీష్, ఆశన్న, శ్రీనివాస్, వెంకట్, సంతోష్, కృష్ణ పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి సమావేశం

నార్నూర్: జిల్లా కేంద్రంలో అఖిల భారతీయ బంజారా సేవ సంఘం (ఏబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రాములునాయక్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి సంఘం బలోపేతంతో పాటు జాతి ఉనికి కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశంలో నాయకులు జాదవ్ చంద్రశేఖర్, జాదవ్ రాజేశ్, ఆడే సురేశ్, గజానంద్ నాయక్, రాథోడ్ ఉత్తం, రాథోడ్ రమేశ్, రాథోడ్ సుభాష్, జాదవ్ కైలాష్‌నాయక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి

ఆదిలాబాద్: రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని నెట్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌతమ్, ఎస్ఆర్ ప్రైమ్ విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన నెట్‌బాల్ జిల్లా స్థాయి సబ్ జూనియర్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పెటా జనరల్ సెక్రటరీ ఎన్. స్వామి, పోటీల ఆర్గనైజర్ హరీశ్, వ్యాయామ ఉపాధ్యాయులు రూపేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి సమీపంలోని ఓ టెంట్‌హౌస్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వన్‌టౌన్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ సత్తార్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

బజార్‌హత్నూర్: గ్రామీణ ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని బజార్‌హత్నూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాథోడ్ ప్రహ్లాద్ అన్నారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, టెంబి గ్రామంలో దేగామ తెలంగాణ గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ విజయ్ కుమార్‌లు ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకు ఖాతాలు, మొబైల్ బ్యాంకింగ్‌పై అవగాహన కల్పించారు. ప్రిన్స్‌పాల్ సునీల్, విద్యార్థులు పాల్గొన్నారు.

తీరనున్న ప్రయాణ కష్టాలు

- కొనసాగుతున్న అంతర్రాష్ట్ర రోడ్డు పనులు
- ఏళ్ల తర్వాత ప్రారంభమైన పనులు


నిపాని వద్ద కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

తాంసి: అంతర్రాష్ట్ర రాహదారి కొన్ని ఏళ్లుగా అధ్వానంగా మారడంతో ప్రజలు, వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డుపై ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. కాగా ఎట్టకేలకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో ఇబ్బందులు దూరం కానున్నాయి. భీంపూర్ మండలంలోని కరంజి(టి) నుంచి ఆదిలాబాద్ రూరల్ మండలంలోని జందాపూర్ వరకు 35 కిలో మీటర్ల మేర అంతర్రాష్ట్ర రహదారి విస్తరించి ఉంది. ఇప్పటికే రోడ్డు పనుల్లో భాగంగా జందాపూర్ నుంచి తాంసి మండలంలోని సావర్గాం గ్రామం వరకు 7 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు పనులు గతేడాది క్రితమే పూర్తయ్యాయి. మిగిలిన 28 కిలోమీటర్లు రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రభుత్వం గతేడాది క్రితమే కరంజి(టి) వరకు రోడ్డు కోసం రూ.18 కోట్లను కేటాయించింది. గత ఆరు నెలల క్రితమే స్థానిక ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంతో మండలవాసులు ఆందోళనకు గురయ్యారు. ఇటీవల పనులు ప్రారంభించడంతో ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో భీంపూర్ మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సావర్గాం నుంచి ఇందూర్‌పల్లి వరకు..

తాంసి మండలంలోని సావర్గాం నుంచి భీంపూర్ మండలంలోని ఇందూర్‌పల్లి వరకు ప్రస్తుతం రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. రూ.18 కోట్ల నిధులతో 9 కిలోమీటర్ల మేర ఇందూర్‌పల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణం జరుగనుంది. ఇప్పటికే జందాపూర్ నుంచి సావర్గాం వరకు 7 కిలోమీటర్లు పూర్తికాగా.. గతంలో రూ.6కోట్ల నిధులతో నిపాని నుంచి ధనోర వరకు సింగల్ రోడ్డు పూర్తిచేశారు. ప్రస్తుతం సావర్గాం నుంచి ఇందూర్‌పల్లి వరకు పూర్తయితే 22 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం పూర్తికానుంది. మిగిలి ఇందూర్‌పల్లి నుంచి కరంజి(టి) వరకు 6 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యేతో పాటు అధికారులు చొరవ చూపితే భీంపూర్ మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు, వాహనదారులకు ప్రయాణ కష్టాలు తీరుతాయి.

చకచకా రోడ్డు పనులు..

సావర్గాం నుంచి ఇందూర్‌పల్లి వరకు గత బీఆర్ఎస్ హయాంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైన పనుల్లో కార్యరూపం దాల్చలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గత మార్చి నెలలో స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పనులకు భూమిపూజ చేశారు. కాంట్రాక్టర్ సకాలంలో బిల్లులు రాక రోడ్డు పనుల ప్రారంభానికి ఆసక్తి చూపలేదు. అయితే ఆరు నెలల అనంతరం పనులు మొదలుకావడం చకచకా సాగుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పనులు జరుగుతున్నాయి

గత కొన్నేళ్లుగా అంతర్రాష్ట్ర రోడ్డు సరిగా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే గుంతల రోడ్డుపై నరకప్రాయంగా వెళ్లాల్సిన పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా పనులు చేపట్టలేదు. కానీ ఎట్టకేలకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడం బాధలు తీరనున్నాయి.

– మదావి లింబాజీ, మాజీ సర్పంచ్, భీంపూర్

సంతోషంగా ఉంది

అధ్వానంగా ఉన్న అంతర్రాష్ట్ర రోడ్డు నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభం కావడం సంతోషంగా ఉంది. నా చిన్నప్పటి నుంచి రోడ్డు సక్రమంగా లేక అవస్థలతో ప్రయాణం చేసేవాళ్లం. ప్రస్తుతం మా గ్రామం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం జరుగనుండటంతో ఏళ్ల నాటి కళ నేరవేరనుంది.

– రుద్ర విలాస్, అర్లి(టి)

చౌరస్తాలోని జెండాలు తొలగింపు


కుమురం భీం జెండా వద్ద పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని బజార్‌హత్నూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన జెండాలను సోమవారం పోలీసులు తొలగించారు. ఉట్నూర్ డీఎస్పీ నగేందర్ ఆధ్వర్యంలో ఎస్సై తిరుపతి జేసీబీతో తొలగించారు. వారం రోజుల క్రితం ఆదివాసీలు చౌరస్తాలో రోడ్డు మధ్యలో కుమరం భీం చౌక్‌గా నామకరణం చేసి జెండా పాతారు. తర్వాత మూడు రోజులకు దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ జెండా ఏర్పాటు చేశారు. మరో మూడు రోజులకు లంబాడా నాయకులు సేవాలాల్ జెండా పెట్టారు. ఒకే చోటా మూడు జెండాలను ఏర్పాటు చేయడంతో వివాదం మొదలైంది. ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్ కుల సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. రోడ్డు నిర్మాణం పనులు పూర్తి తర్వాత జిల్లా కలెక్టర్ ఆదేశాలతో విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అప్పటి వరకు రోడ్డు మధ్యలో జెండాలను తొలగించాలని కోరారు. అయితే ఆయా సంఘాల నాయకులు ప్రత్యేక పూజల అనంతరం పోలీసులు జేసీబీతో జెండాలు తొలగించారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరికొండ: మండలంలోని వాయిపేట్‌తో పాటు చిమ్మన్‌గూడి, చింతగూడ, రామ్‌నగర్, భీంపూర్, సూర్యపేట్‌లకు వ్యవసాయం కోసం త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని రైతులు, కాంగ్రెస్ నాయకులు కోరారు. సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఇమామ్, రైతులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయండి

సిరికొండ మండలానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయాలని మండల కాంగ్రెస్ నాయకులు కోరారు. సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేస్తుందన్నారు. ఉన్నత విద్యలో గిరిజనులను ప్రోత్సహించాలన్నారు.

‘బౌద్ధులుగా మారినా.. రిజర్వేషన్ మారదు’


మాట్లాడుతున్న ప్రభాకర్, నాయకులు

ఉట్నూర్‌రూరల్: బౌద్ధులుగా మారినా.. రిజర్వేషన్ మారదని భారతీయ బౌద్ధ మహాసభ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ గడపలే, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞకుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉర్వేల బుద్ధవిహార్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సమగ్ర ఇంటింటా సర్వేలో మతం అనే విభాగంలో బౌద్ధ మతంగా చేర్చాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బొంకంటి సుభాష్, కాంబ్లే ప్రజ్ఞశీల్, జాడి వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎఫ్ఆర్‌వోకు సన్మానం

ఇటీవల ఉట్నూర్, ఇంద్రవెల్లి మండల ఫారెస్ట్ రేంజ్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన రత్నజాడే శీలానంద్‌ను ఆయా సంఘాల నాయకులు స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. సన్మానించిన వారిలో రత్నజాడే ప్రజ్ఞాకుమార్, గడపలే ప్రాకార్, కాంతరావ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బౌద్ధమతంగా నమోదు చేసుకోవాలి

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినున్న కులగణన సర్వేలో ఎస్సీ మహార్ కులస్తులు తమ మతాన్ని బౌద్ధమతంగా నమోదు చేసుకోవాలని భారతీయ బౌద్ధ మహాసభ ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు ప్రభాకర్ గడపాలే అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో బౌద్ధ అనుయాయులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రచార కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఝాడే ప్రజ్ఞశీల్, కాంతరావ్ వాగ్మరే, వాగ్మరే కామ్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సంక్షేమానికి కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని కేస్లాపూర్ రైతువేదికలో ప్రభుత్వం మంజూరు చేసిన 40 గ్రామాల దండారీ ఉత్సవాలకు రూ. 15 వేల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదివాసీలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ దండారీ అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, నాయకులు ఎండి మసుద్, మెస్రం నాగ్‌నాథ్, మెస్రం వెంకట్‌రావ్, జుగాదిరావ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రైతులకు మద్దతు ధర కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని మిథల్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. సీసీఐ ద్వారా క్వింటాల్ పత్తికి రూ. 7521లతో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాథోడ్ గణేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, నాయకులు మసుద్, సోమోరే నాగోరావ్, కొరెంగా సుంకట్‌రావ్, జితేందర్, పవార్ దుద్‌రామ్ పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి


చెక్కు అందజేస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు అన్నారు. సోమవారం జైనథ్ మండలంలోని బెల్లూరిగూడలో దండారీ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి దండారీ బృందాలు సందర్శిస్తూ సంస్కృతిని కాపాడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ఆదివాసీలు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. త్వరలో ఆదివాసీలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రతీ ఆదివాసీ పంట పొలాల్లో బోరు ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎంపీకి వినతి

తాంసి: భీంపూర్ మండలంలోని కమట్‌వాడ పరిధిలోని జెండాగూడ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌ను కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంపీ గోడం నగేశ్ నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఏళ్ల గడుస్తున్నా విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. వారి వెంట మాజీ జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రాజు, గ్రామస్తులు మారుతి, పరుశురాం, దత్తు, తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

బోథ్: మండల కేంద్రానికి చెందిన మౌనిక ఇటీవల బీఎస్సీ నర్సింగ్‌లో సీటు సంపాదించింది. కాగా కళాశాలలో ఫీజు కట్టేందుకు డబ్బులు లేకపోవడంతో దిక్కు తోచని పరిస్థితిలో ఉన్న ఆమెకు ఫ్రెండ్స్ యూత్ గణేష్ మండలి నిర్వాహకులు రూ. 10 వేల ఆర్థిక సాయం సోమవారం మౌనికకు అందజేశారు. ప్రతిఒక్కరూ స్పందించి ఆమె చదువుకు సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గణేష్ మండలి నిర్వాహకులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: బీజేపీ ఆధ్వర్యంలో క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. రాష్ట్ర యువ నాయకులు రాథోడ్ రితేశ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు గల రాజకీయ పార్టీ బీజేపీ అని అన్నారు. ప్రతీ ఒక్క కార్యకర్త సాధారణ 100 సభ్యత్వాలు పూర్తి చేసి క్రియాశీల సభ్యత్వం పొందాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేశ్, బింగి వెంకటేశ్, టేకం హరిప్రసాద్, రాథోడ్ శేషరావు, సతీశ్, రవి, మహేందర్, రవీందర్, జగన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నాణ్యమైన వైద్యం

నేరడిగొండ: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నాణ్యమైన వైద్యసేవలు అందించడం జరుగుతుందని వైద్యురాలు నిఖత్ అన్నారు. మండలంలోని చిన్న బుగ్గరాంలో గ్రామంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ సంతోష్ మాట్లాడుతూ వైద్య శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ తండా, గూడాల్లో వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్, అంగన్‌వాడీ టీచర్లు జాదవ్ సుమిత్ర, రాథోడ్ స్వాతి, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

‘కులగణన సర్వే నిలిపివేయాలి’


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వ కులగణన నిలిపివేయాలని నేతకాని జాగృతి సంఘం ఆధ్వర్యంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘ నాయకులు నర్సయ్య, ప్రవీణ్, రాజేశ్వర్, మహేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నేతకాని కులస్తులు 18 నుంచి 20 లక్షల పైబడి జనాభా కలిగి ఉన్నారని ప్రస్తుతం ఎస్సీ కులం కోడ్ నంబర్ 40 ద్వారా నేతకాని కులం పేరుతో సర్టిఫికెట్లు పొందుతున్నామన్నారు. కోడ్ నెం. 40లో నేథని పేరును తొలగించి నేతకాని కులం పేరును పొందుపర్చాలని కోరారు. నాయకులు ముందుం గవస్కర్, జాడి రాజేశ్వర్, చలం, రాజేశ్వర్ పాల్గొన్నారు.

1970 జీపీ రికార్డు ప్రకారం కులగణన చేపట్టాలి

ఎదులాపురం: 1970 జీపీ రికార్డుల ప్రకారం.. గిరిజనేతరుల కులగణన చేపట్టాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నైతం బాలు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. గిరిజనేతరులు భూములు అమ్మడం, కొనడం పూర్తిగా నిషేధమని 1/59, 1/70, పెసా చట్టా ల్లో ఉందన్నారు. ఐటీడీఏ, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గిరిజనేతరులు ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. సంబంధిత రెవెన్యూ గ్రామాల్లో జీపీ రికార్డుల ప్రకారం 3 ఫిబ్రవరి 1970 కంటే ముందు స్థానికంగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న గిరిజనేతరుల కుల గణన మాత్రమే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇందులో సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు శంకర్, నర్సింగ్, శ్రీనివాస్, భీంరావు పాల్గొన్నారు.

కుటుంబ పెద్దను కోల్పోయిన లోటు తీరనిది

- ఎస్పీ గౌస్ ఆలం


కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ

ఆదిలాబాద్‌రూరల్: కుటుంబ పెద్ద కోల్పోయిన లోటు ఎప్పటికీ తీరనిదని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. బోథ్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించిన రమణారెడ్డి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఆయన స్వగ్రామమైన మావల మండలంలోని వాఘాపూర్‌లో స్పృహ కోల్పోయి పడిపోయాడు. కుటుంబసభ్యులు చికిత్స కోసం రిమ్స్ ఆసుపత్రికి తరలించగా ఆయన అప్పటికే మృతి చెందారు. సోమవారం వాఘాపూర్ గ్రామంలో నిర్వహించిన రమణారెడ్డి అంత్యక్రియాల్లో ఎస్పీ గౌస్ ఆలం పాల్గొని పార్థివదేహనికి నివాళులర్పించారు. ప్రభుత్వపరంగా వచ్చే లబ్ధి త్వరగా అందేలా కృషి చేస్తానన్నారు. తక్షణ సహాయం కింద అంత్యక్రియల ఖర్చు కోసం రూ. 20వేలు కుటుంబ సభ్యులకు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి, బోథ్ సీఐ రమేశ్, ఎస్సైలు ప్రవీణ్, అప్పారావు, అశోక్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక


నార్నూర్: సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

నార్నూర్: అఖిల భారతీయ బంజారా సేవ సంఘం గాదిగూడ మండల కమిటీని సోమవారం సంఘం జిల్లా నాయకుడు ఫాక్స్ చైర్మన్ ఆడే సురేశ్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. ఏబీఎస్ఎస్ మండలాధ్యక్షుడిగా రాథోడ్ వెంకట్రామ్ (ఖాండో), ప్రధాన కార్యదర్శిగా జాదవ్ మారోతి (డొంగర్‌గావ్), ఉపాధ్యక్షుడిగా కైలాస్ (పర్సువాడ), సహాయ కార్యదర్శిగా రాథోడ్ సురేశ్ (బోడ్డిగూడ), ట్రెజరర్‌గా రాథోడ్ జితేందర్ (తోయగూడ)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బంజారాల అభివృద్ధి, సంక్షేమంతో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షణ కోసం సంఘం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాథోడ్ దిలిప్‌కుమార్, రాథోడ్ గోవింద్‌రావు, బావుసింగ్, ధన్‌లాల్, గోకుల్ పాల్గొన్నారు.

రాష్ట్రీయ పర్ధాన్ జనజాతి ఉద్థాన్ సంఘటన్ కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రీయ పర్ధాన్ జనజాతి ఉద్థాన్ సంఘటన్ జిల్లా కార్యవర్గం, జిల్లా మహిళా కార్యవర్గం, జిల్లా యూత్ కార్యవర్గాన్ని సోమవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మెస్రం శంకర్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా గేడం వనిత, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలుగా సిడాం గిరిజబాయి, గౌరవ అధ్యక్షురాలుగా మెస్రం గంగాదేవి, జిల్లా యూత్ అధ్యక్షుడిగా వెట్టి దేవిదాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గేడం శివకృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా గేడం మాధవ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సిడాం రాంకిషన్, పాండురంగ్, గేడం సాంబాజీ, సెద్మకి సుభాష్, వెట్టి ఉత్తం, ప్రకాష్ పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

తాంసి: గ్రామస్థాయిలో పనిచేస్తున్న వీవోఏల సమస్యలను పరిష్కరించాలని భీంపూర్ వీవోఏల సంఘం అధ్యక్షుడు అరుణ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట పెండింగ్‌లో ఉన్న స్త్రీనిధి ఇన్సెంటివ్ ఇవ్వాలని ఆందోళన చేపట్టారు. అనంతరం కార్యాలయ అకౌంటెంట్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. రూ.20వేల వేతనం అందించడంతో పాటు ఆరోగ్య బీమా, సాధారణ భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పుర్క దాంజీ, వీవోఏలు పోచ్చక్క, ప్రమోద్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీ.. ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్ కాలనీలో కారు ఢీ ఒకరు గాయపడినట్లు ఏఎస్సై యూనుస్ తెలిపారు. ఇచ్చోడకు చెందిన షేక్ పాషా ఆదివారం పనులు ముగించుకొని బైక్‌పై భార్యతో కలిసి ఇచ్చోడకు వెళ్తున్నారు. ఇదే క్రమంలో మార్గమధ్యలో రాంనగర్ కాలనీలో భార్య పాదరక్ష కింద పడిపోవడంతో బైక్‌ను పక్కకు ఆపి కాలి నడకన వెళ్లాడు. అప్పుడే ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో గాయపడ్డాడు. షేక్ పాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హార్టికల్చర్ కార్యాలయంలో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని హార్టికల్చర్ కార్యాలయంలోని కంప్యూటర్, మానిటర్ చోరీ చేసినట్లు ఏఎస్సై యూనుస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి కార్యాలయంలోని కంప్యూటర్, మానిటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు హార్టికల్చర్ వైస్ ప్రిన్సిపాల్, సీనియర్ సైంటిస్టు (ఆగ్రో) డాక్టర్ మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టీ పాయింట్‌లో..

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దస్నాపూర్ కాలనీలో సాగర్ సూపర్ మార్కెట్ సమీపంలోని మిస్టర్ టీ పాయింట్‌లో ఆదివారం చోరీ జరిగినట్లు ఏఎస్సై యూనుస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మిస్టర్ టీ సెంటర్‌లో బీరువాలో భద్రపరిచిన రూ. 15వేల నగదును ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. బాధితుడు హిమాన్షు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినోద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899